కొండమల్లెలు

ఆ ఏటి నీళ్ళతో ముఖం కడుక్కొని-ఆ తియ్యటి నీళ్ళు దోసెళ్ళతో తాగి-ఆ ఏటి ఒడ్డున ఇసుకలో కాసేపు కూచుని-ఆ నీటి మీదినుంచి వచ్చే చల్లటి గాలికి ప్రాణము తన్మయమౌతూఉంటే - ఏవేవో మధురస్మృతులను తలంచుకుంటూ గొంతెత్తి కమ్మగా పాడుకునే శివనాథానికి గంట ఎంతయిందో కూడా తెలియకుండా పోయింది. అలా పాడుకుంటూ అతడు తుండుగుడ్డను ఇసకనేలమీద పరచి, తల కింద చెయ్యిపెట్టుకుని పడుకున్నాడు. ఏడు గుఱ్ఱాలదొర వేటచాలించాడు. ఆకాశము మీద మేఘాలు అనేక రూపాలు ధరించి జేవురురంగు అంటీ అంటనట్టు పూసుకుని పరుగులెత్తుతున్నాయి.

అతడలా ఒంటరిగా - హాయిగా - కమ్మగా తనివితీర పాడుకుని చీకట్లు కమ్ముకుంటుండగా లేచాడు. తువాలు దులుపుకుని ఇంటిముఖము పట్టాడు. నది ఒడ్డున ఇసుకనేల దాటిన తరువాత కొంతదూరము తాటివనము ఉన్నది. ఆ వనములో అక్కడక్కడా ఒకటీ రెండూ గుడిసెలను దాటిపోతేగాని ఊరురాదు. శివనాథుడు పెద్దపెద్ద అంగలువేస్తూ వనము దాటుతుండగా మడమదగ్గర ఎడమకాలు భగ్గుమన్నది ఆ చురుక్కుమనటములో అతడేదో పురుగు కరిచిందనుకుని ఒక్క గావు కేక పెట్టాడు. ఆ కేకకు అక్కడున్న గుడిసెలోనుంచి పిల్లా పెద్దా బిలబిలలాడుతూ బయటికి వచ్చారు.

అందరూ చూస్తూ నిలబడితే-గురవడు గుడిసెలోనుంచి వస్తూనే "ఏందండీ పంతులుగారూ?" అంటూ సమీపించాడు.

శివనాథము నేలమీద చతికిలబడి కాలు ఒడిలో పెట్టుకుని చీకటిలో కనబడక పోయినా కాలుపట్టి తడిమి చూచుకుంటున్నాడు. గురవడు ఒక్క అంగలో బుడ్డి దీపము తెచ్చాడు. ఆ వెలుగులో అతడిని సమీపించి కాలు పట్టుకుని 'తుమ్మ ముల్లండీ పంతులుగారూ!' అంటూ బలవంతాన చేత్తో ముల్లుపెకికి పారవేశాడు గురవడు. శివనాథం కాలు తడిమి చూసుకుంటూ 'అమ్మయ్య' అన్నాడు.

'మా గుడిసె ముందుకు రండి. నొప్పి పుట్టకుండా మందు వేస్తా'నని గురవడు శివనాథాన్ని తీసుకువెళ్ళి జిగురువంటి పదార్థము పూశాడు. అతడు వద్దు వద్దంటూ వుండగానే బుడ్డిదీపము చేతబట్టుకుని తాళ్ళదాకా వరకూ సాగనంపాడు శివనాథాన్ని.

శివనాథానికి గురవడితో అలా పరిచయమయింది మొదట. అది మొదలు కొని శివనాథం ఏటికి వస్తూనో - పోతూనో 'గురవా బాగున్నావా?' అనటము మామూలయింది, వారిద్దరి మధ్యా అది అలవాటయి స్నేహబంధముగా మారింది. అతడికి ఆ ఏటిఒడ్డూ గురవడి పలకరింపూ నిత్య జీవితంలో కలిసి పోయాయి.

శ్రావణ భాద్రపదాలలో శివనాథము ఇంట్లోనే ఉండి పోయాడు. ఆ యేడు మోపుగా వర్షాలు ఆరంభించాయి. అదిగాక కొత్త సంసారములో అతడికి పొద్దు పోయేది. భార్య శకుంతల వంటలో కూడా అతడి సహాయము కోసము కనిపెట్టుకుని కూచునేది. అతడు కల్పించుకోకపోతే వస్తువులు నాలుగూ నట్టింటనే ఉండేవి. బట్టలు నాలుగుమూలల్లో పడి దొర్లేవి. అది నాపనికాదని ఆమె ముడుచుకూచుంటే ఆఫీసునుంచి వచ్చిన అగాయితు అతడే యిల్లు చక్కబెట్టేవాడు.

శివనాథం ఎక్కువజీతాల తెగలోవాడు. కలిగినవాళ్ళలోనే జీవితానికి కావలసిన నాలుగూ అమర్చుకోవా లనుకుంటాడు. అతడి కేదయినా 'లేదు-చాల'దనుకోవటానికే అసహ్యము. శకుంతల దీనికి సరిగ్గా వ్యతిరేకము. పొద్దున్నే లేచి 'మా మేనమామ గారింట్లో అంటే మా అత్తయ్య ఎప్పుడు నిద్రలేచినా ఆవిడకి చెల్లిపోతుంది. అప్పుడు కబుర్లు వేసుకుని కూర్చుందంటే పన్నెండయినా స్నానానికి లేవదు' అంటుంది. ఆ మాట వినిపించుకోకుండా తొమ్మిదింటికి ఆఫీసుకు వెళ్ళవలసిన శివనాథం. ఆమెకు వంటప్రయత్నాలన్నీ చేసి పెడతాడు. వంటయిన తరువాత-అతడికి పీటవేసి విస్తరి వేయకుండా-'చూశారూ! మా అక్కయ్య విప్పిన చీరెలన్నీ లంగచుట్టి పారేస్తుందండీ! అయితే దానికి రెండు బీరువాల నిండా చీరెలు ఉంటాయి కనుక లెక్కలేదనుకోండి' అంటూ చేతిగాజులు చూచుకుని 'అరిగి బద్దలయిపోతున్నాయి. ఎవరికి పట్టింది?' అనుకుంటూ పచ్చడి మాటకానికి బయలుదేరుతుంది. ఈ లోపల శివనాథం తానే వడ్డించుకుని తిని ఆఫీసుకి బయలుదేరి పోతూ 'వెళ్ళుతున్నా. తలుపేసుకో' అంటాడు. 'అయ్యోరామా! ఇంత

లోనే ఇంత తొందరపడాలా!' కనుబొమలు చిట్లించుకుని మూతి సాగదీసుకుంటూ వెళ్ళి తలుపు గడియవేసుకునేది.

ఆశ్వీజమాసంలో చిరుచలి ప్రవేశించింది. శివనాథము పాత అలవాటు ప్రకారము ఏటిఒడ్డుకు వెళ్ళి, ఒంటరిగా ఇసుకలో పడుకుని బరువెక్కిన మనసును గాలికి ఆరబెట్టి – కమ్మగా హాయిగా కూనిరాగాలు తీసుకుంటూ చీకటి పడేవరకు ఉండి తిరుగుముఖ మవుతున్నాడు అవి శారదరాత్రులు. శరచ్చంద్రికలు గుడిసెలలోకి దూరి వింతవెలుగు నిస్తున్నాయి. శివనాథం మందంగా అడుగులువేస్తు తాటివనంలో ప్రవేశించుతూ ఉండగా 'పంతులుగారూ!' అన్న కేక వినబడ్డది. వెనక్కితిరిగి చూశాడు. 'ఏం గురవయ్యా' అన్నాడు శివనాథం.

'పంతులుగారు! మిమ్మల్ని ఒకమాట అడుగుదామనుకుంటున్నా. ఈ మధ్య మీరు కండ్ల బడలేదు' అన్నాడు.

ఏమిటన్నట్లు శివనాథ, గురవడి వైపు చూశాడు.

'మా పోచాలును ఊరి నుంచి తీసుకురావాలి. మంచిరోజు చూచి చెప్పరూ!' అన్నాడు.

శివనాథానికి నవ్వు వచ్చింది. తనకంతా తెలుసుననుకున్నాడు కాబోలు గురవయ్య. అయినా అతడంతగా తనను నమ్మి, గురిగా అడుగుతున్నప్పుడు కాదనట మెందుకని 'చూడు గురవయ్యా! నీకు తొందరగా తీసుకురావాలని ఉన్నదా!' అన్నాడు.

సిగ్గుతోకూడిన నవ్వు నవ్వుతూ చేతులు నలుపుకుంటూ 'అవునండీ!' అన్నాడు.

'అయితే ఎల్లుండి బుధవారము దశమి బాగుంది. ఏం నీకు వీలవుతుందా?' అన్నాడు.

గురవడు ఎగిరి గంతేశాడు. 'దణ్ణం పంతులుగారూ! మళ్ళీ కలుస్తా'నంటూ ఆ చీకట్లో కలసిపోయాడు.

తరువాత పదిహేను రోజులవరకూ శివనాథం ఎటూ కదలలేక పోయాడు. ఆఫీసులో పని - ఇంటిలో గృహచ్ఛిద్రాలు, మధ్యమధ్య వర్షమూ వీటితోనే సరి పోయింది. అతడికి ఏటికి వెళ్ళనినాడు మనసంతా చికాకుగా ఉంటుంది. ఏదో బరువుగా ఉంటుంది. ఒంటరిగా-ఇసుకలో పడుకుని-ఆ విశాలమయిన అనంతాకాశాన్ని చూస్తూ-మిణుకు మిణుకు మనే చుక్కలను లెక్కిస్తూ తాచుపాములా పరుగెత్తే ఆ సెలయేటితో మనసు పొంగుతీర ఆవేదనలను వెళ్ళబోసుకోవాలని అతడి ఆకాంక్ష. కాని డబ్బుఖర్చు లేని ఆ కోరికకూడా ఓ పక్షము వరకూ తీరిందికాదు.

ఆనాడు ఈదరగాలి లేదు. ఆకాశము స్వచ్ఛంగా ఉన్నది. కులాసాగా ఈల పాటతో మందంగా నడుస్తూ శివనాథం తన మామూలు చోటికి చేరుకున్నాడు. అతడు తువాలు పరవబోతుంటే గురవడు సవ్వడి కాకుండా అక్కడికి చేరాడు. 'పంతులుగారూ! పంతులుగారూ!' అనుకుంటూ.

గురవడిని చూడగానే పోచాలును తీసుకు రావటానికి తాను మంచిరోజు చూసి చెప్పటము శివనాథానికి జ్ఞాపకము వచ్చింది. గురవడు ముసిముసి నవ్వులు నవ్వుతూ 'పంతులుగారూ! మీరు చెప్పిన వేళకే తీసుకువచ్చానండి. ఎవరూ వద్దన లేదండీ' అన్నాడు.

'అయితే యింకేం? మంచిదేగా!' అన్నాడు.

'కాదండీ! నే నెప్పుడెళ్ళినా ఈ వారంకాదు-మరోవారం అనో-మళ్ళీరా అనో తిప్పేవాళ్ళండీ. మీరు ఏం ముహూర్తం పెట్టారో. వెళ్ళగానే వెంట పంపే రండీ. అప్పటినుంచి నండీ కమ్మనికూడు తింటున్నానండి. మా అమ్మపోయిన తరువాత కమ్మటికూడే కరవయిం దండీ''.

'అయితే సుఖంగా ఉన్నావన్నమాట' అన్నాడు అతని సంతోషాన్ని చూసి ఆనందిస్తూ.

'మీదయ అండీ. మీరు మాగుడిసెకు రావాలండి ఒకసారి'

'నీ వెప్పుడు రమ్మంటే అప్పుడే వస్తా. ఎప్పుడు రమ్మంటావు చెప్పు' అన్నాడు.

'ఇప్పుడే రండి. నా వెంటరండి' అని దారితీశాడు. శివనాథము చివాలున లేచి తువ్వాల దులుపుకుని గురవడి వెనుక నడిచాడు. తాటి వనములో మొదటి మలుపు తిరగగానే అతడి గుడిసె కనబడుతుంది. కుడిచేతి పక్కగా వెళ్ళితేగుమ్మం ఎదురవుతుంది. అది తాటి కమ్మల గుడిసె. దానిముందర రెండడుగుల వెడల్పున రెండుపక్కలా అరుగులు ఎర్రమట్టితో అలికి ముగ్గులు వేసి ఉన్నాయి. గుడిసె ముందర ముచ్చటగా నాలుగు ముగ్గుకర్రలు పలుకరిస్తున్నాయి. అరుగుమీద శివనాథాన్ని కూచోబెట్టి గురవడు లోపలికి వెళ్ళి ,నాలుగు అరటిపళ్ళు పళ్ళెములోపెట్టి తీసుకు వచ్చాడు.

పోచాలు నల్లటి ముఖంలోంచి పెద్దకళ్ళు వెలుగును చిమ్ముతున్నాయి. తల నున్నగా దువ్వుకుని ఎర్రటిపూలు ముడుచుకున్నది. చంద్రకాంతరంగు నేతచీరె- సెనగపూల రవిక ఆమె దేహకాంతికి కొట్టవచ్చినట్టున్నాయి. ఆమె తలవంచుకొని గురవడి పక్కన నిలబడింది.

వాళ్ళిద్దరిని చూస్తూంటే అతడికి కడుపు నిండినట్లయింది. ఏదో ఘనకార్యము చేసినట్టుగా శివనాథం మనసు ఉక్కిరిబిక్కిరి అయింది. చిరకాలము సుఖంగా ఉండండని దీవించి లేచాడు. ఇద్దరూ చేతులు జోడించి శివనాథాన్ని సాగనంపారు.

అడవిలో కొట్టిన కట్టెపుల్లలు మోపులుగా కట్టి ఊళ్ళోకి తెచ్చి అమ్ముతాడు గురవడు. వస్తూవస్తూ ఆనాటి సరుకులు తెచ్చి యింట్లో పడేస్తాడు. బుడ్డి దీపపు వెలుగులో సరుకు బాగుచేసి- గురవడు ఏటికి పోయి కాళ్లూచేతులూ కడుక్కొని మడతమంచము వాకిట్లో వేసుకుని సేదతీర్చుకునే అంతలో పోచాలు వండి వారుస్తుంది. ఊసులాడుతూ యిద్దరూ ఒక పళ్ళెంలోనే పెట్టుకు తింటారు. ఈ సంగతులన్నీ గురవడు శివనాథానికి చెప్తుంటే అతడి కేదో చెప్పరాని ఆనందము కలిగేది.

దీపావళి వెళ్లిన నాలుగోనాడు కాబోలు శివనాథము తాటివనము దాటుతూ ఉండగా చప్పున గురవడు జ్ఞాపకము వచ్చి వాళ్ళ గుడిసెవైపు నడిచాడు. గుడిసె తలుపు దగ్గరగా వేసి ఉన్నది. సందులలోనుంచి బుడ్డి దీపపు వెలుగు కనిపిస్తున్నది. గురవడిని పిలిచాడు. పోచాలు బయటికి వచ్చి 'అయ్యగారూ! గురవడు లేవటం లే'దన్నది. పోచాలు వెంట అతడు లోపలికి వెళ్ళాడు. గురవడు మంచమ్మీద పడుకొని మూలుగుతున్నాడు.

'ఏమిటి గురవా ఈ పడక ! మూలుగుతున్నా వెందుకు ?' అన్నాడు.

'దివ్వెల పండుగునాడు పటాను చేతిలో పేలిందండి' అన్నాడు గురవడు. మూలుగుతూనే లేచి కూర్చుని 'పంతులు గారికి చాపవెయ్యే' మని పోచాలును పిలిచి వేయించాడు. 'దణ్ణాలండీ పంతులు గారూ? మీదయవల్ల బతుకుతున్నాం. పోచీ! నీకోక చూపించవే వారికి!'.

'మీరొస్తే మూలుగంతాపోయింది చూశారా? పండుక్కి వద్దంటునే ఉన్నా. ఈ చుక్కల చీరె గువ్వకన్ను రవిక కొన్నాడు. నేడిక్కడికి వచ్చినాకనే కందండ కడియం కొన్నాడు.'' పోచాలు తీసి చూపించింది.

'గురవా ! నీ సంపాదనే బాగున్నది! నాకంటె నీవే నయమన్న మాట!' శివనాథము అంటుంటే గురవడు మొలక నవ్వులతో తల వంచుకొని 'బాబయ్యా! పోచి చేసిన పని వినరూ? అది ఇక్కడికి వచ్చేనాము గాజులకని పోకలకని తల్లి పది రూపాయలు చేతిలో పెట్టిందట. అవి పెట్టి నాకు ధోవతులు కొన్నది. కట్టుకునే వరకూ చంపింది' అన్నాడు.

ఆ యిల్లు-ఆ వాతావరణమూ- ఆ జంట- ఆ కబుర్లు-ల పరస్పరాకర్షణ- ఒకరిపైన ఒకరు సరసమైన నేరాలు చెప్పుకోవటమూ శివనాథానికి మధురంగా ఉన్నది. కొంతసేపటికి తెప్పరిల్లి 'నీ చెయ్యి ఎట్లాఉన్నది. గురవా !' అని అనగలిగాడు శివనాథము.

'వేళ్ళన్నీ ముడుచుకు పోయాయి. చెయ్యి బాగా తెరవలేను' అని చెయ్యి చూపించాడు గురవడు.

'తొందరగా నయంచేసుకో. రెక్కల కష్టంచేసి బతికే వాడివి' అంటూ శివనాథము ఇంటిదారి పట్టాడు

తరువాత గురవడి సంగతి కనుక్కోవటానికి శివనాథానికి వీలు కలుగక పోయింది. ఆఫీసు పనుల తొందరలో అతడి మాటే జ్ఞాపకం రాలేదు. ఒకనాడు శివనాథము కచేరినుండి ఇంటికి వస్తూ ఉండగా దారిలో కట్టెల మోపు ఎత్తుకు పోతున్న పోచాలు కనబడ్డది. గురవడి సంగతి అడిగాడు. అతడికి నయముకాలేదట అంచేత తాను కట్టెలమ్ముతున్నా నన్నది. గురవడు శివనాథం కోసం కలవరి

స్తున్నాడని చెప్పింది. 'సరేలే చూద్దాం' అని ఆమెతో చెప్పి ఇంటికివెళ్ళిపోయాడు. కాని వెంటనే గురవడిని చూడటానికి వెళ్ళలేక పోయాడు.

శివనాథము ఇట్లా అనుకుంటూ అనుకుంటూ ఉండగానే ఋతుచక్రము ఒకసారి చుట్టివచ్చింది. ఈ లోగా అతడు బిడ్డ తండ్రి అయినాడు. ఆరునెలలయినా తిరక్కుముందే అతడి తండ్రి కాస్తా పోయాడు. ఇద్దరు తమ్ముళ్ళతో తల్లి అతడి దగ్గరకే వచ్చింది. ఆ సంసారములో మునుగుతూ తేలుతూ ఉన్నాడు శివనాథము.

ఆనాడు శివనాథము ఆఫీసు నుంచి ఒక గంట ముందుగా బయలుదేరాడు. సగము దారిలో కొచ్చేవరకు ఈ గంట సేపట్లో ఇంట్లో ఏదైనా పనిచూచుకో వచ్చనుకున్నాడు. కాని సగము దూరము వచ్చిన తరువాత గురవడు జ్ఞాపకము వచ్చి తిన్నగా అక్కడికి వెళ్ళాడు. గడపలో నిలబడి చూశాడు. గురవడు మంచము మీద కూచుని మేదరి ఉయ్యాల తొట్టె ఊపుతున్నాడు. 'ఎన్నాళ్ళకు చూశాను, పంతులుగార్ని! లోపలికిరండి' అన్నాడు లేచి నిలబడి.

'చెప్పావు కావేం? పిల్లా- పిల్లవాడా?' అనడిగాడు శివనాథము గడపలో నిలబడే ఆశ్చర్యపోతూ.

'ఒకటి కాదు బాబయ్యా రెండు. ఇద్దరూ ఆడపిల్లలు' అన్నాడు నవ్వుతూ.

'ఇంకేం అదృష్టవంతుడివి అవును గాని-నీవు యింట్లో ఉన్నావేం! పోచాలు ఎక్కడికి వెళ్ళింది?'

'నా చెయ్యిచూశారా? చచ్చుపడి పోయింది. గొడ్డలి పట్టలేను. ఈకాలు ఈడుస్తూ నడవ్వలసిందే. నాబదులు పోచాలే గంజి నీళ్ళకు డబ్బులు తెస్తుంది, ఏం చేస్తాం? ఈపిల్లలికీ ఆగంజే యింత పోస్తున్నాం.'

శివనాథం మాట్లాడకుండా గురవడివైపు చూస్తున్నాడు. అతడికి కళ్లుగుంటలు పడ్డాయి, ముఖం దొక్కుపోయింది. బాగా నల్లబడ్డాడు. అంతలో పోచాలు వచ్చింది.

'అయ్యగారు చాలా కాలానికి వచ్చారు. పిల్లల్ని చూశారా అంటూ ఒక్కొక్క పిల్లనే తీసుకు వచ్చి చూపించింది. పోచాలులో ఆది వరకు ఉన్న

విగారింపు లేదు. కాని కళ్ళ తేజస్సు తగ్గలేదు. శివనాథం జేబు తడుముకొని రెండు రూపాయలు తీసి పోచాలు చేతిలో పెట్టి 'పిల్లల కేదైనా కొనిపెట్టు' అన్నాడు. అంతదూరము రానేవచ్చాను గదా అని ఏటి ఒడ్డుకు వెళ్ళాడు. ఏడు గంటలవాటే వరకు పడుకున్నా డక్కడ ఇసుకలో. చప్పున జ్ఞాపకం వచ్చింది. ఆసాయంత్రానికి తాను ఊర తెస్తానని యింట్లో చెప్పినట్లు. మెల్లగా లేచి బయలుదేరాడు.

ఇల్లు చిన్నది, ఒక వంటయిల్లూ. గదీ, వసారా. అందులో ఇంతమందీ కాలక్షేపము చెయ్యాలి. తమ్ముళ్లు చదువుకోవాలి. తల్లి వచ్చినప్పటినుంచీ ఇంటి పనీ ఆవిడే చూచుకుంటోంది.

సంసారము బయట పడకుండా ఉండాలని తన తల్లి పాడా శపించిల సంగతే ముందు చూస్తుంది. ఇంటింటా ఉన్న గృహచ్ఛిద్రాలు ఒక్కొక్కసారి శివనాథానికి ఎదురవుతూ ఉంటాయి. అనాదతడు అలస్యంగా యింటికివస్తూ ఉంటాడు.

ఉగాదినాడు సాయంత్రము ఆరు గంటలవేళ తల్లి చేసిన పూర్ణపుబూరెలు పోట్లం కట్టుకొని శివనాథం గుమ్మడి యింటికి బయలుదేరాడు. గుమ్మడి యింటి ముందు నిలబడి చూస్తే తలుపు దగ్గరగా వేసిఉన్నది. అతడా అరుగుమీద కూర్చొని ఆ యింటి ముందు వేసిఉన్న ముగ్గులనూ, గడపకు కట్టిన తోరణాన్నీ చూస్తు న్నాడు. అంతలో లోపల్నించి ఏవో మాటలు వినబడ్డాయి.

'నా మాట విను. ముఖం కడుక్కొని బొట్టు పెట్టుకో. పెట్టెలో నుంచి ఆచీరతీసి కట్టుకో. పిల్లలకి బాబుగారిచ్చిన రూపాయలతో కుట్టిన అంగీలు తొడుగు'

'అంతా చేస్తా-కాని-నీవు ముందు లేచి నేను అప్పుడు కొన్న ఆకోక కట్టుకుంటానంటే'

'నేను ఏ మొగం పెట్టుకొని కట్టుకోను పాపే చెప్పు! ఆపీడావి మధ్యంలో ఉండి నీవు తెచ్చినదాంతో బతుకు తున్నాను! సగం సచ్చినట్టుంది నా బతుకు'

'అదుగో ఆదే వద్దు.'

అయిదు నిముషాల వరకూ ఏనందకీ పేదు ఇవ్వటూ బట్టయ కట్టుకున్నా రేమో ననుకున్నాడు శివనాథం.

తటాలున పోచాలు తలుపు తీసి పిల్లనెత్తుకుని బయటకు వచ్చింది. శివనాథాన్ని చూడగానే తెల్లబోయి 'ఎంతసేపయింది వచ్చి' అన్నది. ఈ మాట విని గురవడు ఇంకొక పిల్లనెత్తుకుని కాలు ఈడుస్తూ బయటికి వచ్చి అరుగుమీద కూర్చున్నాడు.

'పంతులుగారు నిలబడితే కూచుంటావా!' అన్నది పోచాలు.

పోచాలు కొత్తగా కాపరానికి వచ్చినప్పుడు కొన్న చుక్కలచీరె గురవడు చెప్పినట్లు కట్టుకున్నట్టుంది. తలలో ఎర్రటి కాగితపువ్వులు పెట్టింది. గురవడూ అప్పటి ధోవతి కట్టుకున్నాడు. వాళ్ళిద్దరూ దీపావళినాడు చూసినట్టే ఉన్నారు. ఇద్దరి ముఖాలూ నవ్వుతూ ఉన్నాయి. మధ్యమధ్య పిల్లలని పలుకరిస్తూ నవ్విస్తున్నారు.

"గురవా! పండగనాడు ఈ పూర్ణాలు తినండి" అని చేతిలో పెట్టాడు, పోచాలు అందుకుని 'తినమని' గురవడి చేతిలో పెట్టింది.

'నీవు?" అన్నాడు గురవడు

'నామాట కేంలే నీవు తిను'

'అయ్యగారు! దీని పంతం చూడండి, ఉన్నదికాస్తా నాకూ పిల్లలకూ కాచి పోసింది. పొద్దుటిపూట దానికేం మిగల్లేదు' అన్నాడు.

'అదంతా చెప్పకు' అన్నట్లు పోచాలు గురవడి వంక చూసింది. కాని గురవడు అటు చూడలేదు.

'అయితే నాముందరే మీ యిద్దరూ చెరికొంచెము తినండి' అన్నాడు శివనాథం.

ఇద్దరూ తినగా చూసి లేచాడు శివనాథం.

అతడిని తాటివనం దాకా ఇద్దరూ సాగనంపారు. అప్పుడన్నాడు శివనాథం 'గురవా! నాకీ ఊరునుంచి బదిలీ అయింది. నాలుగు రోజుల్లో వెళ్ళిపోతాను' అని.

వెళ్ళిపోతారా అన్నట్టు యిద్దరూ జాలిగా చూశారు. 'ఆనాడు ముల్లుతీసినప్పటి నుంచీ బాబయ్యగారు తండ్రిలాగున్నారు' అనికళ్ళల్లో నీరు నింపుకున్నాడు.

శివనాథానికి కూడా కళ్లు చెమ్మగిల్లాయి. అతడు కనబడే వరకూ చూసి వాళ్ళు వెనక్కు మళ్ళారు.

ఆ రాత్రి శివనాథానికి చాలాసేపు నిద్రపట్టలేదు. ఈ ఊరు వచ్చిన మూడేళ్లూ ఆఫీసులో పని ఎక్కువయినా—చివాట్లుతిన్నా—ఇంట్లో గృహకల్లోలాలు ఒత్తిడి చేసినా ఆయేటిఒడ్డుకు పోయి గంటలతరబడి పడుకుని అన్నీ మరిచిపోయేవాడు. ఆయేటి ఒడ్డును చూడగానే మనసుశాంతపడేది. కాని అతడి అంతరాత్మ ఎదురు తిరిగింది. 'నీకు మనశ్శాంతిని కలిగించిందీ.హాయిని గొలిపిందీ గురవడి కుటుంబం. వాళ్ళ పొందిక—తృప్తి ఆప్యాయత నీకు బ్రహ్మానందాన్ని కలిగించాయి. అని గదమాయించింది అంతరాత్మ. 'అయితే ఇటువంటి గిరిజనులను బాగుచేయటానికా నన్ను ప్రభుత్వం బదిలీ చేసింది?"అనుకుంటూ చాలా సేపు పక్కమీద దొర్లాడు శివనాథం.